"అమ్మా! అక్కయ్యొచ్చిందే!" అన్న కేక హాలంతా ప్రతిధ్వనించింది.

"ఎవరూ! మన సింధూరొచ్చిందా?" అంటూ వరలక్ష్మి చేతిలోని పని విడిచి వరండాలో కొచ్చింది.

అప్పటికే సింధూరి రిక్షా దిగడం, జాహ్నవి సామాను దించడం ఐపోయింది. వరలక్ష్మమ్మ సంతోషంతో ఎదురెళ్ళింది.

"ఏమ్మా! వస్తున్నట్టు ఓ కార్డు ముక్క రాస్తే నాన్నగారు స్టేషనుకి వచ్చేవారుగా! రవి బాగున్నాడా?" అంటూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది.

ఆ పలకరింపుతో సింధూరి వదనాన శ్రావణమేఘాలు కమ్ముకున్నాయి. వద్దంటున్నా వినకుండా కన్నీరు కదిలొచ్చింది. చటుక్కున తల్లి గుండెల్లో మొహం దాచుకుందామె.

"పిచ్చిపిల్లా! ఒంట్లో బాగుంటుందా? ఇలా ఐపోయావేమిటి? అంటూ తల నిమిరి లోనికి తీసుకు వచ్చింది "బామ్మా! ఎవరొచ్చారో చూడు" హుషారుగా అరిచింది జాహ్నవి.

"ఏమిటా అరువులు? ఎవరొచ్చారేమిటి. పెళ్ళిపిల్లకుండాల్సిన సిగ్గూ, బిడియం..అవ్వ! మచ్చుకైనా కనిపించడంలేదు. ఇంతకూ ఎవరదీ?' అంటూ హాల్లోకొచ్చి ఎదురుగా నిలుచున్న సింధూరిని చూసి "నాతల్లే! నువ్వా?" అంటూ అక్కున చేర్చుకుంది.

"బాగున్నావా బామ్మా!" ప్రశ్నించింది సింధూరి.

"ఏం బాగే తల్లీ! అదిగో చూసేవుగా ఆ రాకాసిని. నన్నెక్కడన్నా ఓ చోట ఉండనిస్తుందా? ఒకటే గొడవ. ఇంకెంత మహాఐతే ఒక నెలో, రెండు నెల్లో. ఆతరువాత దాన్ని కాస్తా పంపించేసి కృష్ణా, రామా అనుకుంటూ ఓ మూల పడుంటాను." నవ్వుతూ చెబుతున్న ఆమె మొహం దిగులుతో చిన్నబోయి కంఠం మూగవోయింది.

"రామ్మా! కాళ్ళు కడుక్కొందువు" అంటూ లోనికి దారితీసింది వరలక్ష్మమ్మ.

* * *

"అక్కా! బావెందుకు రాలేదే?" భోజనం చేస్తూ అడిగింది జాహ్నవి.

"ఏదో అర్జెంటు పనుందట. తరవాతొస్తానన్నారు. మీ బావ గ్రీన్‌సిగ్నల్ ఇస్తేనే కాని పెళ్ళి చేసుకోవా ఏం?" తలెత్తకుండానే ప్రశ్నించిందామె.

"బావైతే ఒకటీ, నువ్వయితే ఒకటీనా? నాకు మీరిద్దరూ ఒకటే. నీకు నచ్చితే చాలక్కా. నువ్వు 'కట్టించుకో తాళి అంటే కట్టించుకుంటాను' వద్దన్నా వనుకో పెళ్ళి పీటలమీంచే లేచొచ్చేస్తాను" ఆప్యాయంగా అక్కవైపు చూస్తూ అందామె.

"మరైతే నే నో రెండోపెళ్ళివాణ్ణి చూపించి 'కట్టించుకోవే తాళి' అన్నాననుకో. అప్పుడేం చేస్తావే?"

"పందెం నీకూ నాకూ! నువ్వావని చేసి చూడు. నే నీమాట వింటానో లేదో! కానీ నీ మనసు నాకు బాగా తెలుసు. నీ చెల్లెలికి రాబోయే భర్తను గురించి నాకంటే ఎక్కువగా ఆలోచిస్తావు" అంటూ, ప్రేమగా చూసిందామె వైపు.

నిండుగా నవ్వింది సింధూరి. "అమ్మాయిగారికి అల్లరేకాకుండా అందమైన మాటలు కూడా వస్తున్నాయే! నాకు తెలిసే నీ సంగతి. అందుకే నీ పెళ్ళై వెళ్ళే వరకూ ఇక్కడే ఉండిపోవాలని వచ్చేసా తెలుసా?" అంది.

"బాగుంది. అబ్బాయి తల్లికీ, తండ్రికీ నచ్చొద్దేమిటి?"

"ఇంకా నచ్చక పోవడమేమిటి? కోరికోరి నిన్ను వెతుక్కుంటూ వస్తే! ఏదో లాంఛనానికి నిన్ను చూడ్డానికి వస్తున్నారు తప్ప ఆ అబ్బాయి నిన్ను కాక వేరొకరిని చేసుకోనని భీష్మించుక్కూర్చున్నాడట."

నాకన్నీ తెలుసులే అన్నట్టు గంభీరంగా నవ్వింది సింధూరి.

"పో! అక్కా! అంటూ సిగ్గుపడింది జాహ్నవి.

"అక్కా చెల్లెళ్ళిద్దరూ ఒకచోట ఉంటే మాటలు భోంచేస్తారు. తిన్నాక తీరికగా రాత్రి వరకూ




స్వర్ణ సుధాకర్

# జీవన హేల

కూర్చుని మాట్లాడుకుందురుగాని'' ప్రేమగా కసిరింది వరలక్ష్మి.

ఆ ఇద్దరూ ఆమెకు రెండు కళ్ళు. ఇద్దర్నీ అలా చూస్తున్న ఆమె కళ్ళనుంచి ఆనందబాష్పాలు రాలాయి. దిష్టి తగులుతుందనుకుంటూ చూపులు మరల్చుకుందామె

* * *

విశ్వనాథం వరలక్ష్మమ్మలకు ఇద్దరే కూతుళ్ళు. ఇద్దరి మధ్య ఓ మగపిల్లవాడు పుట్టి సంవత్సరం తిరక్కుండానే పోయాడు. ఐతే వరలక్ష్మి ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉండటం వల్ల ఆ కాలంలోనే ఆపరేషన్ చేయించాడు. 'పుట్టిన పిల్లలు చాలు. ముందు తల్లి ఆరోగ్యం ముఖ్య'మంటూ.

రంగమ్మ భోళామనిషి. అత్తగా అధికారం చెలాయించాలని చూడలేదామె, అమ్మగా ఆదరణ అందించింది. పరాయి పిల్ల అన్న భావనే లేకుండా అపురూపంగా చూసుకుందామె. అసలా ఇద్దర్నీ చూసిన వాళ్ళెవరూ అత్తా కోడళ్ళనుకోరు. తల్లీ బిడ్డలనే భావిస్తారు. ప్రేమతో ఆ ఇంట అందరినీ బంధించిందామె. అందుకే ఇప్పటికీ ప్రతి విషయంలోనూ ఆమె సలహా లేకుండా ఏ పనీ చేయరు ఎవ్వరూ.

సింధూరి, జాహ్నవి ఇద్దరూ అందానికి తీసిపోరు. సింధూరి చామనఛాయ ఐనా కనుముక్కు తీరు తీర్చిదిద్ది నట్లుండి చెక్కినశిల్పంలా ఉంటుంది. జాహ్నవి కనుముక్కుతీరు మామూలైనా మేలిమి బంగారు ఛాయలో మెరిసిపోతూ చూపరులనిట్టే ఆకర్షిస్తుంది. ఆ ఇద్దరూ అన్నిటా ఉత్తర దక్షిణ ధ్రువాలు. గలగల పారే సెలయేరొకరు. నిండుగా ప్రవహించే నిర్మల నది వేరొకరు. ఒకరి మాటలు ఉరికే గోదారి పరుగులు. వేరొకరి పలుకులు గంభీరంగా సాగే గంగా తరంగాలు. ఆ ఇద్దరివల్లా వసంతం ఆ ఇంట కొలువున్నట్లే అనిపిస్తుంది.

సింధూరికి పదిహేడవ ఏటనే పెళ్ళైంది రవితో. ప్రస్తుతం వరంగల్‌లో బ్యాంక్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్న ఊళ్ళో ఇంటర్ ఐపోగానే అక్క దగ్గరే ఉండి బి.ఎ. కంప్లీట్ చేసింది జాహ్నవి. అక్కా చెల్లెళ్ళిద్దరి మధ్య ఆరు సంవత్సరాల తేడా ఉంది. జాహ్నవి చిన్నగా ఉన్నప్పుడే సింధూరి పెళ్ళి కావడం వల్ల రవి దగ్గర కూడా అక్క దగ్గరున్నంత చనువూ ఉందామెకు. ఎప్పుడూ ముభావంగా ఉండే రవిని జాహ్నవి మాటల్లోకి దించి ఆటలు పట్టిస్తుంది. జాహ్నవి ఉన్న మూడు సంవత్సరాలూ సింధూరికి ఆనందంగా గడచిపోయాయి. ఈ మధ్య ఏదో పెళ్ళిలో జాహ్నవిని చూసిన ప్రద్యుమ్న ఆమెను తప్ప వేరెవరినీ పెళ్ళిచేసుకోననీ, కట్నంతో పనిలేదనీ కబురు చేసేడు. మొదట ఇదంత తేలికగా తీసుకున్న విశ్వనాథం, వాళ్ళు మళ్ళీ మళ్ళీ కబురు చేయడంతో మధ్యవర్తిని పంపించేడు అతని తల్లి దండ్రులతో మాట్లాడిరమ్మని.

ప్రద్యుమ్న తల్లిదండ్రులు కూడా తమకొక్కడే కొడుకనీ తమకే బోలెడంత ఆస్తి ఉంది కనుక అతని ఇష్టమే తమ అభీష్టమనీ, లాంఛనంగా పెళ్ళి చూపులకు వచ్చినా త్వరలోనే ముహూర్తాలు పెట్టుకుందా మనీ కబురుచేశారు. ఈ విషయాలన్నీ తెలియజేస్తూ వీలైతే పెళ్ళి చూపులకు సింధూరినీ, రవినీ కూడా రమ్మని ఉత్తరంరాశాడు విశ్వనాథం.

పెళ్ళి చూపులు రేపనగా సింధూరి వచ్చింది.

''అమ్మా!'' అన్న పిలుపుతో తల తిప్పి చూసింది రంగమ్మ.

''ఎవరొచ్చారేమిటి? లోపల మాటలు వినిపిస్తున్నాయి'' అంటూ సోఫాలో కూర్చున్నాడు విశ్వనాథం.

''ఇంకెవరూ? మన సింధూరొచ్చింది. సింధూరి రాకతో పెళ్ళికళ వచ్చేసిందిరా విశ్వా! ఇక ఈ సంబంధం ఖాయం. ఐనా నా చిన్న తల్లికేం తక్కువ? బంగారు బొమ్మలాగుంటుంది.''

''ఆహా! చూశావా బామ్మా! నువ్వే ఒప్పుకున్నావు నేను బంగారు బొమ్మనని. మరి నిన్నేమో దీన్ని చేసుకునే వాడెవడో కాని నెల తిరక్కుండా సన్యాసుల్లో కలవడం ఖాయం అన్నట్లు గుర్తు'' లోపల్నుంచి వచ్చి బామ్మను చుట్టేసింది జాహ్నవి.

''నోరు ముయ్యవే! అపశకునం మాటలూ నువ్వూనూ! పెద్ద దాన్ని నేనేమన్నా నా మనమరాళ్ళకు దీవెనలౌతాయే'' అంటూ జాహ్నవి బుగ్గలు నొక్కింది.

ఇంతలో సింధూరి వచ్చి తండ్రి పక్కన కూర్చుంది. కూతుర్ని దగ్గరకు తీసుకొని ''ఏమ్మా! నన్నిబ్బంది పెట్టడం ఇష్టం లేక, ఉత్తరమైనా రాయకుండా వచ్చేశావా తల్లీ!'' అంటూ ''వరా! నాకో కప్పు కాఫీ'' అని లోనికి కేకేశాడాయన.

సింధూరి రాకతో ఆ ఇంట అందరి మనసుల్లో ఆనందం వేయిరేకులై వెల్లివిరిసింది.

* * *

అనుకున్నట్లుగానే పెళ్ళివారు రావడం, పెద్ద ఆర్భాటం లేకుండానే తాంబూలాలు పుచ్చుకొని ముహూర్తాలు పెట్టుకోవడం జరిగిపోయాయి. పెళ్ళి సరిగ్గా నెల రోజులే ఉంది.

కలిసొచ్చిన అదృష్టమంటే ఇదే అనుకుంటూ విశ్వనాథం, వరలక్ష్మమ్మలు మురిసిపోయారు. రంగమ్మ ఆనందానికి అవధుల్లేవు. అబ్బాయి చక్కగా ఉండటమే కాక, కట్నం మాటైనా ఎత్తకుండా పెళ్ళి మాత్రం తమ అంతస్తుకు తగినట్లు చేయమని చెప్పారు. వారి సంస్కారానికి ఆ ఇంటిల్లిపాదీ సంతోషించారు.

అంత వచ్చి వెళ్ళాక, ''అబ్బాయెలా ఉన్నాడే?'' చెల్లెలి కళ్ళలోకి గుచ్చి చూస్తూ అడిగింది సింధూరి.

''నేను సరిగా చూడలేదక్కా!'' మొహమాటంగా చెప్పిందామె.

''అలా చెప్పు. అప్పుడే అనుకున్నా నా చెల్లెలు ఎలా ఒప్పుకుందా అని! ఆ అబ్బాయికి ఎడమ కన్ను బాగా మెల్ల ఉందే.''

''అబ్బే! అదేం లేదే! కళ్ళు చాలా చక్కగా ఉంటేనూ!''

''అమ్మ దొంగా ! మరి నువ్వు చూడలేదన్నావు?'' నవ్వుతూ అంది సింధూరి.

జాహ్నవి సిగ్గుతో తల వంచింది.

''అరే! విశ్వా ఇందాకట్నుంచి చెప్పాలా వద్దా అని సందేహిస్తున్నాను. పెళ్ళంటే నూరేళ్ళ పంట. ఇందాక అబ్బాయి మేనమామ లోనికి నీళ్ళ కోసం వచ్చి 'పిన్నిగారూ! అబ్బాయి గుణం' అంటూ ఏదో గొణిగాడురా! ఎందుకైనా మంచిది తొందరపడొద్దు. కొంచెం ఆలోచించు'' అంది రంగమ్మ.

''బామ్మా! నువ్విలా అడ్డుపుల్ల లెయ్యొద్దు. నేనతన్నే చేసుకుంటా'' అంటూ కోపంగా తలెత్తి, ఆమె పెదవి చాటున దాగిన నవ్వుని గమనించి, అరచేతుల్లో మొహం దాచుకొని సిగ్గుతో లోనికి పోయిందామె. హాలంత నవ్వులతో మార్మోగింది.


* * *

రాత్రి రంగమ్మ, విశ్వనాథం, వరలక్ష్మమ్మ హాల్లో కూర్చున్నారు.

''కట్నం వాళ్ళడక్కపోయినా మనం అనుకున్నదేదో ఇచ్చేస్తేనే బాగుంటుంది కదా?'' తల్లి మొహంలోకి చూస్తూ అడిగాడు విశ్వనాథం.

''ఔనురా! ఎలాగూ దాని పేరుమీద బ్యాంకులో యాభై వేలు ఉన్నాయి కదా? అవి అలాగే ఉంచు. పెళ్ళయ్యాక వాళ్ళిష్టం-పిల్ల పేరుమీదే ఉంచుతారో, ఏం చేసుకుంటారో! ఇక మనకున్న భూమిలో ఓ పదెకరాలు అమ్మేస్తే ఎకరా ఐదు వేల చొప్పునైనా యాభై వేలు వస్తాయి. వాటిలో ఓ జత రాళ్ళ గాజులూ, ఓ చంద్రహారం చేయించి మిగిలిన డబ్బులు పెళ్ళి ఖర్చులకుంచుకుందాం. నువ్వంతగా ఇదైపోకు'' అందామె.

''అది కాదమ్మా! ఎంత ఆడపిల్లలైనా పెళ్ళి చేసి చేతులు దులుపుకోలేముగా? తరువాతైనా పురుళ్ళూ, పుణ్యాలూ అంటూ ఏదో ఖర్చు వస్తూనే ఉంటుంది. నాకా రిటైర్మెంటు దగ్గర కొచ్చింది. పదెకరా లమ్మేస్తే ఉన్న పదిహేనెకరాలూ తిండి గింజలకే సరిపోతే, పై ఖర్చులకు రాబడి ఎక్కణ్ణుంచొస్తుంది చెప్పు. అందుకే ఇప్పుడు ఆ నగల మాటెత్తకుండా 15-20 వేలు ఎక్కణ్ణుంచైనా వడ్డీకి తెస్తా. ఓ ఐదారు నెలల్లో చిట్టీ కడుతున్న డబ్బు, పంట డబ్బు వస్తాయిగా? అప్పుడు ఆ



అప్పు తీర్చి అమ్మాయికి నగలు చేయిద్దాం.''

"బాగుండదేమో ఆలోచించరా! ఆడపిల్ల నిచ్చుకునేవాళ్ళం. వాళ్ళేమీ అడగలేదని అన్నిటా ఇలా మొండి చెయ్యి చూపిస్తే రేప్పొద్దున మన పిల్లనెలా చూస్తారో?'' అంటూ సందేహం వెలిబుచ్చిందామె.

"నాన్నా!'' అంటూ గదిలో కొచ్చింది సింధూరి.

"ఏమ్మా!రా! ఇంకా నిద్రపోలేదూ?'' అంటూ పక్కకు జరిగి కూతురికి చోటిచ్చాడు విశ్వనాథం.

"ఏమిటోరా! పిల్ల మరీ పాడైపోయింది. దాని ఆరోగ్యం బాగా లేనట్టుంది. ఈ పెళ్ళి కాస్తా ఐనాక, మన డాక్టరమ్మకు చూపించు.''

"అదేంలేదు బామ్మా!నన్ను చూసి చాల రోజులైనందుకు నీకలా అనిపిస్తుంది. ఏమ్మా! నువ్వు చెప్పు'' తల్లి వైపు చూసిందామె

అంతవరకూ పిల్ల పెళ్ళై వెళ్ళిపోతే ఇల్లు చిన్నబోతుందన్న దిగులుతో కూర్చున్న వరలక్ష్మమ్మ ఉలిక్కిపడి, "లేదులేవే! బామ్మ మాట నిజం. పిల్లలు కలగలేదని బెంగపెట్టుకున్నావా?'' అంది.

"ఇదిగో నువ్వలాంటిదేం పెట్టుకోకు. నాకు పెళ్ళైన పదమూడు సంవత్సరాలకు మీ నాన్న పుట్టేడు. నీకూ నా చాలొచ్చుంటుంది అంతే!'' అంది రంగమ్మ.

"ఇంతకూ ఏమిటమ్మా చెప్పాలనుకుంటున్నావు?'' మాట మార్చాడు విశ్వనాథం.

"మీరు మరోలా అనుకోనంటే ఒక మాట నాన్నా! నేనెలాగూ రాళ్ళ గాజులు వేసుకోవడం లేదు. అవి జాహ్నవి పెళ్ళికి మా గిఫ్ట్‌గా ఇచ్చెయ్యాలనుకుంటున్నాను. ఇక నా చంద్రహారం ఎలాగూ ఉందిగా? అదిప్పుడు చెల్లెలికి ఇచ్చెయ్యండి. మీకు చేతికి డబ్బందేక దానికి కొత్తది చేయించి నాది నాకిచ్చెయ్యొచ్చు'' తండ్రి మొహంలోకి చూసింది.

"చాల్లేవే మహా చెప్పొచ్చావు! ఆడపిల్ల సొత్తు తినే వంశమా మాది? ఇప్పుడు మాకేం తక్కువైందని? కాకపోతే అనుకోకుండా త్వరగా కుదిరినందువల్ల ఈ ఇబ్బంది కానీ'' కోపంగా చూసింది రంగమ్మ.

"సింధూ! వద్దమ్మా! ఈ సంగతి తెలిస్తే మీ వాళ్ళేమనుకుంటారు? ఐనా రవికి తెలిస్తే అపార్థం చేసుకోడూ? కావాలంటే ఎవరి దగ్గరైనా అప్పు తెస్తార్లే. అంతేకానీ ఇలాంటి ఆలోచనలు పెట్టుకోకు. ఇంకానయం. మన అదృష్టానికి ఇంత చక్కని సంబంధం దొరికి నందుకు సంతోషించాలి కాని ఇదో సమస్యా? కాకపోతే మీ నాన్న ఉద్దేశం ఒకటేనమ్మా! ఇప్పు డెలా సుఖంగా, సంతోషంగా ఉన్నామో, రేప్పొద్దున రిటైరైనాక కూడా ఇలాగే ఉండాలి కానీ ఉన్న ఊళ్ళో ఓ మెట్టు తగ్గకూడదు. ఇప్పుడూ అప్పుడూ కూడా ఏ విషయంలోనూ మీకు తేడా కన్పించ కూడదనే మా తాపత్రయం. ఇవన్నీ మనసులో పెట్టుకోక పోయి పడుకో తల్లీ!'' కూతురివంక చూస్తూ అందామె.

"లేదమ్మా!మీ అల్లుడు కూడ అదే చెప్పారు! నేను ముందుగా రావడానికి వీలుండదు. ఏమైనా అవసర ముంటే మన చేతనైన సహాయం చేయాలి. ఆయనకి మాత్రం ఎవరున్నారు'' అని. ఇక నా కా గాజులు నప్పవని వేరే డిజైన్ గాజులు చేయించుకోవాలనుకుంటున్నా. అందుకే దానికి ఇవ్వాలని ఎప్పుడో అనుకున్నా. మీ క్కూడా తెలుసు కదమ్మా ఆయనకు జాహ్నవి అంటె ఎంతిష్టమో. మరిప్పు డిలా చేశారని తెలిస్తే ఎంత బాధ పడతారు చెప్పు. ఇదే కొడుకైతే ఇలాగే వద్దనేవారా అమ్మా?'' నోటి కొచ్చిన అబద్ధాల్ని అందంగా కూర్చిందామె.

ఆ మాటల కా ముగ్గురి హృదయాలు మూగవోయాయి ఆనందంతో.

'ఏమంటా'రన్నట్లు వాళ్ళ మొహాల్లోకి చూశాడు విశ్వనాథం.

"విశ్వా! ఇక లేరా! ఇప్పటి కమ్మాయి చెప్పినట్లే చేద్దాం. మళ్ళీ అబ్బాయేమైనా బాధ పడతాడేమో!

"సరే నమ్మా! నేనెలాగూ వరంగల్ వెళ్ళి రవిని స్వయంగా పిలిచి రావాలనుకుంటున్నా. అప్పుడతనితో మాట్లాడుతా లే.''

"వద్దు నాన్నా! ఆయన తన కోసం పనులన్నీ మానుకొని మిమ్మల్ని రావద్దన్నారు. అసలే టైం తక్కువుంది. ఒక్కరూ ఎక్కడని చూసుకుంటారు? రేపు నేనన్ని విషయాలతో ఉత్తరం రాస్తాగా!'' గాభరా నటిచుకుంటూ అందామె.

"ఏమిటో తల్లీ! అన్నీ నువ్వే చెబుతున్నావు. పోనీ నేను మీ వల్లెకెళ్ళి మీ అత్త మామల్నైనా పిలిచొస్తాను బాగుండదు'' అన్నాడు.

"సర్లెండి. ఇప్పటి కిలా చేద్దాం. ఇక లేవండి. చాలా పొద్దు పోయింది. మళ్ళీ పొద్దున్నే లేవా''లంటూ లేచింది వరలక్ష్మమ్మ.

*** *** ***

"అక్కా! ఉత్తరం నీకే'' అరిచింది జాహ్నవి.

"ఇలా తే!'' పరిగెత్తుకుంటూ వచ్చింది సింధూరి.

"అమ్మా ఆశ! అందుకో చూద్దాం'' నవ్వుతూ చేయి పైకెత్తింది.

ఎగిరెగిరి అందుకోలేక, "బామ్మా! చూడవే నా ఉత్తరం ఇవ్వడం లేదు'' అరిచింది సింధూరి కోపంగా.

"ఏమిటర్రా! ఏమైంది?'' అంటూ వచ్చింది రంగమ్మ. అంతా చెప్పింది సింధూరి.

"ఏమే! దాని మొగుడు దానికి రాసిన ఉత్తరంతో నీకేంపని? ఆ మూడు ముళ్ళు పడనియ్ నీకూ వస్తాయి ఉత్తరాలు! అసలే దాని కొంట్లో బాగుండటం లేదు. నేననుకున్నది నిజమై, దాని కడుపు పండితే, ఆ ఏడుకొండల వాడి దర్శనం చేసుకొని, నా తల నీలాలిస్తా నని మొక్కుకున్నా'' రెండు చేతులూ జోడించి చెప్పిందామె.

"అ దెలా కుదురుతుందే బామ్మా! నువ్వు చచ్చి దాని కడుపున పుడతావన్నట్లు గుర్తు. నువ్వింకా ఇక్కడే ఉన్నావు కదే. మళ్ళీ ప్లేటు మార్చేశావేం?'' బుగ్గ మీద చెయ్యి వేసుకొని నవ్వుతూ అంది జాహ్నవి.

"లేదే. దాని కడుపున ఓ కాయ కాస్తే కాని నేను పోను. నా తల్లిని నిండుగా చూసుకున్న తరువాతే నే చచ్చి నీ కడుపున పుడతానే! అప్పుడు చూడు నిన్నెంతగా వేధిస్తానో'' నవ్వుతూ అందామె.

సింధూరి అప్పటికే ఆలోచనలో పడిపోయింది.

లోపలి నుంచి మాటలన్నీ వింటున్న వరలక్ష్మమ్మ ఊరుకోలేక పోయింది.

"జాహ్నవీ! నీ అల్లరి అంతకంతకూ ఎక్కువౌతూంది. ఎంత మాటంటే అంత మాటా అనడమేనా? ఇంకోసారిలా అన్నావంటే నాన్నకు చెప్తా'' అంటూ కోపంగా చూసింది.

"చాల్లేవే వరా! ఆ పిల్ల నేమీ అనొద్దు. నా మనవరాలూ, నా ఇష్టం. మేమూ, మేమూ ఏమైనా అనుకుంటాం. మధ్యలో నువ్వు కలగజేసుకోకు. ఈ పిల్ల కాస్తా వెళ్ళిపోతే నాకు పొద్దెలా పోతుందా అని కొట్టుకుంటూంది ప్రాణం.'' జాహ్నవిని దగ్గరకు తీసుకొని కళ్ళొత్తు కుందామె.

మౌనంగా లోనికి వెళ్ళింది వరలక్ష్మమ్మ.


*** *** ***

పెళ్ళి రోజు దగ్గర కొచ్చింది. రవి రాకపోవడం ఆ ఇంట అందరికీ వెలితిగానే ఉంది. సింధూరిని పక్కకు తీసికెళ్ళి మరీ మరీ అడిగాడు విశ్వనాథం - అతని కే విషయంలో నైనా కోపం వచ్చిందేమోనని.

"అదేం లేదు నాన్నా! చూస్తున్నారుగా? ఎప్పటి కప్పుడు ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. వాళ్ళ బ్యాంక్‌లో ఏవో లెక్కలు తేడాలొచ్చాయట. అవి సరిజేయక పోతే ఈయనకు మాటొస్తుందట. వీలైనంత వరకూ తప్పక వస్తానన్నారు. మా అత్త మామల దగ్గరకు కూడా వెళ్ళొచ్చావుగా? అటువంటి దేమైనా ఉంటే వాళ్ళు చెప్పరా? ఈ రోజో, రేపో వాళ్ళంతా వస్తారు కూడ. నువ్విలా మనసులో దిగులు పెట్టుకోవద్దు.''

"ఏమిటో నమ్మా! రవి రాకపోవడం ఎంత వెలితిగా ఉందో తెలుసా? పెళ్ళి టైము కొచ్చినా బాగుండును'' నిట్టూర్పు విడిచారాయన.

జాహ్నవి, ప్రద్యుమ్నల వివాహం జరిగిపోయింది. సింధూరి జాహ్నవి వెంట



అత్తవారింటికి వెళ్ళి మూడు రోజులూ ఉండి వచ్చింది. చెల్లెలి ఇంటిని చూసి ఎంతో ముచ్చట పడింది.

రవి రాలేదన్న బాధ మాత్రం ఆ ఇంట అందరికీ ఉంది. అందరికీ సర్ది చెప్పలేక సింధూరి సతమతమైంది. ఇక అంతా ఐంది కనుక, మరుసటి రోజు లేడీ డాక్టరుకు సింధూరిని చూపించి, తరువాత కూతురి వెంట వరంగల్ వెళ్ళి అలాగే అల్లుడిని పలకరించి రావాలని నిర్ణయించుకున్నాడు విశ్వనాథం.

*** *** ***

పొద్దెక్కినా సింధూరి లేవలేదేమిటా - అని గదిలోకి వెళ్ళింది వరలక్ష్మమ్మ. సింధూరి చేయందుకుని కెవ్వుమని అరిచిందామె. ఆ అరుపుకు అందరూ పరుగెత్తుకు వచ్చారు. అప్పటికే సింధూరి ఈ లోకాన్నుంచి సెలవు తీసుకుంది.

దిండు కింద రెపరెపలాడే ఉత్తరాన్ని తీసి చదివి అక్క మీద వాలిపోయింది జాహ్నవి.

"నా ప్రియమైన జాహ్నవీ!

మీ అందరి గుండెల్లో విరిసిన ఆనందపు మల్లెల్ని ఒక్కసారే....ఒక్కదాన్నే తెంచుకుని పోతున్నానే. ఎంత స్వార్థమో కదూ? నన్ను క్షమించు. నీ పెళ్ళి నిండుగా జరగాలని, ఏ ఆటంకమూ రాగూడదని ప్రతి నిమిషం నాలో నేనే రగిలి...రగిలి, కుమిలి...కుమిలి...వద్దు తల్లీ, ఆ నరకం! ఎప్పుడూ అబద్ధం చెప్పని నేను కాలకూట విషంలాంటి ఈ నిజాన్ని దాచాలని అడుగడుగునా అబద్ధాలు చెబుతూ మిమ్మల్ని నమ్మించాను. మీ అందరి ఆప్యాయతలో తేలిపోతూ ఇంకా...ఇంకా ఉండాలన్న ఆశ చావక జీవితాన్ని ఎక్స్‌టెండ్ చేసుకుపోతున్నా కానీ...ఇక నా చేతకాదే! అబద్ధాలు చెప్పి చెప్పి అలసిపోయాను. అందుకే సెలవు తీసుకుంటున్నాను.

మీరంతా ఎంతో ఉన్నతుడిగా ఊహించే మీ బావ ఓ అల్పుడని చాల ఆలస్యంగా తెలుసుకున్నా. అతని హృదయం పాషాణమని మొదటిసారే కనుగొన్నాను. నాకు పిల్లలు పుట్టలేదన్న ఓ చిన్న సాకుతో నిన్నే కావాలంటే...నేనేం చెప్ప గలను? హాస్యమని పరిహసించ బోయాను. నిజమని తెలిసి నివ్వెరబోయాను. పన్నీరు తప్ప కన్నీ రెరుగని మీ గుండెలను నా సమస్యాక జడివానై కుదిపేస్తుందని పెదవి విప్పి చెప్పలేక పోయాను.

పిల్లల కోసమే ఐతే వే రెవరినైనా చేసుకోమని అర్థించాను. కాళ్ళు పట్టుకొని వేడుకున్నా ఫలితం లేదు సరికదా నరకం అంటే ఎలా ఉంటుందో చూపించారు. ఏ రాక్షస క్షణాన ఆ ఊహ అతనిలో చోటు చేసుకుందో తెలియదు కానీ, నీ పెళ్ళి గురించిన ఉత్తరం రావడంతో అతని నీచత్వం బయట పడింది. అతను కోరేది నీ అందాన్నని మొదటిసారిగా తెలుసుకున్నాను. నీ అంగీకారంతోనే రావాలి తప్ప, నీవు లేని ఆ ఇంట్లో నాకు స్థానం దొరకదని కచ్చితంగా చెప్పారే!

ఈ సంగతి ముందే నాన్నకు తెలిస్తే, 'తన బంగారు తల్లి జీవితం ఇలా బూడిదపాలైం'దని తట్టుకోలేరనీ, తన రెండు కళ్ళలో అమృతం దాగుందని మురిసే అమ్మ ఓ కంట్లో విషం నిండుకుందని తెలిసి ఉండలేదని, అందరికంటే ముందే, మీ అందరి ఒడిలోనే సెలవు తీసుకోవాలని చెప్పలేదే! ఇక నుంచి నువ్వూ, నేనూ అన్నీ నీవై అమ్మా, నాన్నా, బామ్మలను మరిపించాలి. సరేనా?

మీ అందరికీ అనుమానం రాకుండా నా కొచ్చే ఉత్తరాల్ని నేనే రాసుకునే దాన్ని. పెళ్ళి హడావిడిలో మీరు గమనించ లేదు. కాని నేనెంత అదృష్టవంతురాల్నో తెలుసా? నా ఈ చిన్న జీవితంలో మీ అందరి సమక్షంలో ఈ నెలరోజుల్లో ఓ యుగానికి సరిపడా అనురాగాన్నీ, ఆప్యాయతనూ, ఆత్మీయతనూ పొందాను. ఇంకేం కావాలి? మళ్ళీ ఎం తశో చూశావా? తిరిగి నీ కడుపునే పుట్టాలని ఉందే. బామ్మా! నీ ఛాన్సు నేను కొట్టేస్తున్నా కోప్పడొద్దు. ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా ఇలా మరో క్షణ మాలోచిస్తే మీ అందరి ప్రేమే చాలన్న తలపు నాలో నిండి ఉండిపోతానేమో! అందుకే వెళ్ళి పోతున్నా.

ప్రేమతో
మీ
సింధూ."

## మినీకథ

# గురుభక్తి

### వనుము సోమశేఖరరావు

అన్ని ఉన్నత పాఠశాలల్లా అదీ ఓ ఉన్నత పాఠశాలే. అంటే అక్కడ విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతి పరిమిత సంఖ్యలో బల్లలు, కుర్చీలు మిగిలిన పాఠశాలల్లో వలె అక్కడా ఉన్నాయి.

ప్రధానోపాధ్యాయుల వారివి ఉన్నత ఆశయాలు. సమయసమ్పూర్తిచక్కటి మూర్తిమత్వము, బోధనా శక్తి, ఆత్మ బలం, సచ్ఛీలము మున్నగునవన్నీ ఆయన సొంతం.

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు నిజాయతీపరులు, బోధనలో చాకచక్యం గలవారు, విద్యార్థులందరినీ ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలన్న తాపత్రయం గల ఉపాధ్యాయులు మాత్రమే ఆ పాఠశాలలో ఉండటమనేది నిజంగా ఆ విద్యార్థుల అదృష్టమే మరి.

విద్యార్థులు - బుద్ధి మంతులు, అల్లరి గాళ్ళు, చదివే వాళ్ళు, చదవని వాళ్ళు, యవ్వనం వేడికి తాళలేక దొంగపేర్లతో ప్రేమలేఖలు రాసేవాళ్ళు..అంగట్లో అన్ని రకాల సరుకు ఉన్నట్లే పాఠశాల ముంగిట్లో ఉండటం సహజమే మరి! వినయ విధేయతలు గల విద్యార్థినీ విద్యార్థుల మాట సరేసరి - వెయ్యి దీపాలు పెట్టి వెతికినా వినయం కనిపించని వాళ్ళూ ఉన్నారక్కడ. ఉపాధ్యాయు లెందుకులే చదువుకోవటానికి గైడ్లు ఉన్నాయి కదా, అటెండన్స్ ఉంటే చాలు అనే అభిప్రాయమేమో మరి వాళ్ళది.

మాష్టారు దార్లో కనిపిస్తే నమస్కారం పెట్టడం గాని, సైకిలు మీదనుంచి దిగి నడిచివెళ్ళడం గాని సాధారణంగా అటువంటి వాళ్ళకు అలవాటు లేదనే చెప్పాలి.

ఆ రోజు మంగళవారం. పాఠశాలకు ఇన్‌స్పెక్టర్‌గా రొచ్చారు. ప్రధానోపాధ్యాయుల వారింట్లో ఆయనకు భోజనం ఏర్పాట్లు జరిగాయి. మధ్యాహ్నం వారిద్దరూ ఇంటికి బయలుదేరారు భోజనానికి. స్కూలు గేటు దాటి బయటకు రాగానే కొంచెం దూరంలో ఒక విద్యార్థి సైకిలు దొర్లించుకుంటూస్కూలువైపు రావటం వారిద్దరూ గమనించారు. ఎప్పుడూ తనని చూసి సైకిలు దిగని ఆ విద్యార్థికి ఆ వినయం ఎక్కడ నుంచి వచ్చిపడిందో అర్థం కాని ప్రధానోపాధ్యాయుల వారి బుర్ర గిర్రున తిరిగింది.

"హెడ్మాస్టర్‌గారూ! చాలా స్కూళ్ళలో క్రమశిక్షణ, విద్య కనుమరుగయి పోతున్నాయండీ. మీ స్కూల్లో మాత్రం పిల్లల క్రమ శిక్షణ, విద్య పట్ల శ్రద్ధా భక్తులు చాలా బాగున్నాయి. గురుభక్తి చూడండి - ఆ కుర్రా డెలా మీ ఎదుట సైకిలు ఎక్కకుండా నడిపించుకొస్తున్నాడో" అన్నారు ఇనస్పెక్టర్‌గారు ప్రధానోపాధ్యాయుల వారిని చంపేస్తూ.

ముందు పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్లు తడబడ్డ హెడ్మాస్టరు - "ఆ..ఆ.. అవునండీ.నేనెప్పుడూ పిల్లల్ని క్రమ శిక్షణలోనే ఉంచుతాను. మా ఉపాధ్యాయులు ముందు క్రమశిక్షణకే విలువిచ్చి తర్వాత చదువువిషయం చూస్తారండీ. ష్హా ష్హా ష్హా" అంటూనవ్వారు ముఖంలో లేని కళను తెచ్చిపెట్టుకుని.

ఆ కుర్రాడు సైకి లెందుకు దిగివస్తున్నాడో ఇంకా అర్థం కాని ప్రధానోపాధ్యాయుడు అతన్ని పరిశీలనగా పైనించి కిందికి చూశారు. ఆశ్చర్యం సైకిలు వెనుక చక్రంలో గాలి లేదు. నా నాన్నా - అందుచేత నడిచి వస్తున్నావా ఈ రోజు అనుకుంటూ - ఇనస్పెక్టర్ గారు కొంప తీసి అసలు విషయం కాస్తా గమనించారంటే గుట్టు రట్టవుతుందనే భయంతో ఆయన దృష్టిని మరల్చటానికి లోన కంగారుపడుతూ అన్నారు ప్రధానోపాధ్యాయులు "వన మహోత్సవం సందర్భంగా మొన్న కుర్రాళ్ళ చేత ఆ మొక్కలన్నీ పాతించామండీ, ప్రకృతి లక్ష్మి పచ్చటి చీర కట్టుకున్నట్లు ఎంత అందంగా ఉందో చూడండి అదంతా."

